**కథ**

**"ఏమండీ!" గోముగా పిలిచింది అరుణ, అప్పుడే పక్కమీదకు చేరిన భర్తని.**

**"ఏంటండీ?" ఆమె పిలుపునే అనుకరిస్తూ, చిలిపితనం కలగలిపిన ధోరణిలో అడిగాడు శరత్.**

**భర్త అలా అనుకరిస్తూ పిలిచేసరికి ఆమె చెప్పాలనుకున్న విషయం చెప్పడానికి కాస్త సిగ్గుపడింది. ఆమె మనోభావాన్ని గ్రహించిన శరత్ ఆమెను మామూలు స్థితికి తీసుకురావడానికి పూనుకున్నాడు.**

# లెక్క తప్పలేదు

''అరుణా! ఈమాత్రం దానికే అలా ఉడుక్కుంటే ఎలా? సర్లే...ఏంటి? ఏదో చెప్పాలనుకుంటునట్టున్నావ్?'' అన్నాడు ఆమె ముక్కు చివర్న చూపుడు వేలుతో సుతారంగా మీటుతూ.

ఆ మాటతో మళ్ళీ తెచ్చిపెట్టుకున్న ఉత్సాహంతో- ''మా అమ్మని చూసి చాలా రోజులైంది. ఒకసారి వెళ్ళిరావాలనుంది'' అంది వినీ వినిపించని స్వరంతో. ఆమె మాట పూర్తికాకుండానే శరత్ అడిగాడు.

''అదేంటి ఈమధ్యే కదా మీ చెల్లెలు సీమంతమంటే వెళ్ళి వచ్చావ్? అప్పుడే చూడాలనిపించేస్తోందా? అసలు మీ ఆడవాళ్ళకి అమ్మని చూడాలనిపించినంతగా మొగుడ్ని చూడాలనిపించదా?'' కవ్వింపుకలగలిపిన చిరుకోపాన్ని నటించాడు.

ఆ మాటతో ఆమెలో వున్న భయం స్థానంలో తెగింపు వచ్చింది. ఎందుకంటే అతడ్ని ఎండగట్టడానికి తగిన పాయింట్ దొరికిందామెకి. అందుకే అతడిమీద ధ్వజమెత్తుతూ ''ఏంటన్నారూ! మొన్ననే వెళ్ళానా? మీకు ఆ మాట అనడానికి మొహమాటం వెయ్యలేదూ? చెల్లెలు సీమంతం తర్వాత దాని పురుడు, పిల్లాడి బారసాల, అన్నప్రాశన కూడా అయిపోయాయి. ఆ రెండింటికి రమ్మని ఎన్ని ఉత్తరాలు రాసినా ఎన్ని ఫోన్‌లు చేసినా మీరు కదిలారూ! కనీసం నన్నైనా పంపించారా? ఏమైనా అంటే 'చాల్లెద్దూ! ఎందుకూ డబ్బు ఖర్చు?' అంటూ ఎగనామం పెట్టేసారు. ఇంకా ఏమైనా గట్టిగా అంటే మీరు పుట్టినప్పట్నుంచి అయిన ఖర్చులన్నీ ఏకరువు పెడతారు. అందుకని నోరుమూసుకున్నాను. అంతమంది అలా పుట్టిళ్ళకి వెళ్ళి వస్తూంటారు. నాకా యోగం వుండొద్దూ'' అంది ముక్కు ఎగబీల్చుతూ. అప్పటికే ఆమె రెండు కళ్ళూ...గంగా యమునలయ్యాయి.

ఆమె ధోరణి చూసేసరికి బెంబేలెత్తిపోయిన శరత్ ఆమెను ఊరుకోపెట్టాలనే బాధ్యత గుర్తొచ్చి కొంచెం దగ్గరగా జరిగాడు. ఆమె భుజం మీద చెయ్యి వేస్తూ ఆమె ముఖాన్ని చుబుకం పట్టుకుని పైకెత్తి- ''ఏంటి అరుణా! ఏదో సరదాకంటే అంత సీరియస్?'' అన్నాడు నవ్వుతూ.

''సీరియస్ కాకపోతే మరేంటి? మీరన్న మాటలు బాగున్నాయా'' అంటూ ఇంకా ఏదో అనబోతూంటే ఆమె పెదవుల్ని అతడి చూపుడు వేలితో మూసేస్తూ-

''అరుణా! వెళుదువుగానిలే. ఇంతకీ ఎన్ని రోజులేంటి దేవిగారి విరహం నాకు'' అన్నాడు.

అతడు ఒప్పుకున్నందుకు మనసులో సంతోషించిన ఆమె ''వారం రోజుల్లో వచ్చేస్తానండీ'' అంది అంతకుముందేమీ జరగనట్టే ప్రవర్తిస్తూ. ఆమె అంత తొందరగా నార్మల్‌కి రావడానికి కారణం లేకపోలేదు. అందుకే అంత తొందరగా స్పందించిందామె.

ఆమె మాటలు విన్న శరత్ ''ఏంటీ వారం రోజులా?'' అన్నాడు భయంగా.

''అవునండీ అమ్మా వాళ్ళింటికి వెళ్ళి నాలుగు రోజులుండి అట్నుంచి నా స్నేహితురాలు ఇంటికి వెళ్ళి, వారం రోజుల్లో వస్తానండి. అది ఎప్పుడూ రమ్మంటోంది పాపం. ఎప్పుడూ వెళ్ళడం అవటం లేదు'' అంది.

''వారం రోజులంటే ఎలా అరుణా! నాకు ఇబ్బంది కాదా?'' గునుస్తూ అడిగాడు శరత్.

''వారం రోజులంటే ఎంతండీ? ఇట్టే గిర్రున తిరిగి పోవూ? మీకు ఇబ్బందిలేకుండా నీలిమగారికి చెబుతాలెండి మీకు కంపెనీ ఇవ్వమని. మీ మంచిచెడ్డలు చూడమని'' అంది. ఆ చివరి మాటలన్నప్పుడు చిన్న వ్యంగ్యపు పాలు కలగలిపింది కనీ కనిపించనట్లు. నీలిమ ప్రసక్తి ఆ రకంగా వచ్చేసరికి ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు. కాని అంతలోనే సర్దుకుని-

''నీలిమగారెందుకు లెద్దూ నేనే ఏదో బాధ పడతాను. ఆవిడ నువ్వు లేనప్పుడు వస్తే బాగోదు. ఎవరైనా ఏమైనా అనుకుంటారు'' అన్నాడు. ఆ మాటలన్నప్పుడు అతడు ఏం మాట్లాడుతున్నాడో అతడికే తెలియలేదు.

ఆ మాటలు విన్న అరుణ- ''ఎవరేమనుకుంటారండీ! అయినా ఒకళ్ళ ఊసు నాకెందుకు మీరు, నీలిమగారు నా శ్రేయస్సు కోరే వారే. మీ ఇద్దరి మీద నాకే అనుమానం లేదు. అవన్నీ ఎందుకుగాని. ఏంటి? వెళ్ళమంటారా? వద్దంటారా?'' అడిగింది అరుణ ఆఖరు మాటగా.

నీలిమ ప్రసక్తి వచ్చేసరికి బుర్ర గిర్రున తిరిగిన శరత్ మరేమనడానికి మనస్కరించక ''నీ యిష్టం'' అనేసాడు.

★ ★ ★

''రండి'' అంది చిరునవ్వుతో ఆహ్వానిస్తూ నీలిమ.

ఆమె చూపించిన కుర్చీలో కూర్చుంటూ అరుణ. ''ఏంటీ పక్క పోర్షన్‌లో వుంటూ కూడా అసలు మా ఇంటివైపే రావటం మానేసారు?'' అంది కాస్త చనువుగా.

''ఏదండీ! పగలంతా ఆఫీస్ పని. ఆపై ఇంటి పని. తీరుబాటే లేదు'' అంది సంజాయిషీ ఇస్తూన్నట్లు.

''అదీ నిజమేననుకోండి. అయినా ఇరుగూ పొరుగూ అన్నాక కాస్త తీరుబాటు చేసుకోవాలి మరి. నేను రాలేదూ ఇప్పుడు?'' అంది అరుణ తను వచ్చిన పనికి నాందిగా.

''మీరూ తీరుబాటు చేసుకుని వచ్చేసరికి చాలా రోజులే అయింది లెండి. అయినా ఊరకరారు మహాత్ములు. మీరు వచ్చారంటే ఏదో విశేషమే వుండాలి'' అంది నీలిమ.

''విశేషానికేముందిగాని! నేను రేపు ఉదయాన్నే ఊరెళుతున్నాను. కాస్త ఈ వారం రోజులూ మావారికి కంపెనీ ఇవ్వమని, కాస్త ఆయన మంచిచెడ్డలు చూడమని అడగడానికి వచ్చాను'' అంది ఆమె ముఖకవళికల్ని పరిశీలిస్తూ.

ఆ మాట విన్న నీలిమ ఒక్కసారిగా షాక్ అయింది. 'ఏంటి ఈవిడ ఉద్దేశ్యం. తన భర్త ఒంటరిగా వున్నప్పుడు కంపెనీ ఇవ్వమని కోరుతోంది. కొంపదీసి వాళ్ళ ఆయనతో తను పెంచుకుంటున్న అనుబంధాన్ని గానీ గుర్తుపట్టలేదు కదా?' అనుకుంటూ ఆ వైపునుంచే రకరకాలుగా ఆలోచనలకు లోనైంది నీలిమ. ఆమె మౌనం చూసి రెట్టించిన అరుణకి జవాబుగా కాస్త తడబడుతూనే..

''నే..నే..నా కంపెనీయా?'' అంది. ఆపై ఏమనలేక ఆగిపోయింది. ఆమె ముఖంలో మారుతున్న

**అయ్యగారి శ్రీనివాసరావు**



రంగుల్ని, మదిలో మెదిలే భావాల్ని కనిపెడుతోంది అరుణ. కానీ ఏమీ ఎరగని దాన్లా అమాయకంగా ముఖం పెట్టి-

''అవునండీ! మావారు ఎప్పుడూ ఒంటరిగా ఉండి ఎరగరు. ఇదివరకు నేనెపుడూ ఊరికెళ్ళినా ఒకటి రెండు రోజులకే నానా అవస్థాపడేవారు. ఇప్పుడు ఓ వారం ఉందామనిపిస్తోంది. మీరు నా అక్కలాంటి వారు. అదీకాక మీ ఇద్దరికీ పరిచయం, చనువు ఉన్నాయి. అందుకే ధైర్యం చేసి మిమ్మల్నడుగుతున్నాను. ఇలా అడిగానని మరోవిధంగా అనుకోకండి'' అంది ముందరి కాళ్ళకి బంధం వేస్తూ.

''అయ్యో ఇందులో అనుకోడానికేముందండీ. నిర్భయంగా వెళ్ళిరండి. '' భరోసా ఇస్తూ అంది నీలిమ.

ఆ మాట విన్న అరుణ నీలిమ చెవి దగ్గరకొచ్చి రహస్యం చెబుతున్నట్లు గొంతు తగ్గించి, ''మగాళ్ళకదండీ ఇంట్లో ఆడది లేకపోతే మనసు చలించవచ్చు. మావారలాటి వారు కాదు లెండి. అయినా జరిగిన తర్వాత బాధపడేకంటే మన జాగ్రత్తలో మనం వుండడం మంచిది కదా! మీకప్పగిస్తే నాకు మరే బెంగా వుండదు'' అంది పూర్తి నమ్మకాన్ని ఆమెపై ప్రదర్శిస్తూ. ఆఖరి మాటలు కావాలనే అంది అరుణ.

అరుణ మాటలు విన్న నీలిమ మనసులోని ఆలోచనలు అతివేగంగా మారుతున్నాయి. ఆ మాటలు సామాన్యమైనవైనా లోతుగా వెళితే ఎన్నో అర్థాలు స్ఫురిస్తాయి. వాటికి రకరకాల భాష్యాలు చెప్పుకోవచ్చు. వాటిని గ్రహించింది కాబట్టే నీలిమ అరుణకి భరోసా ఇచ్చింది.

ఆ మాటతో అరుణ ఆనందంగా వెనుదిరిగింది. ఒక పక్క ఆనందంగానే వున్నా తను సాహసం చేస్తున్నానేమో! ఇలా చేయడం వల్ల తను ఊహించిన దానికి వ్యతిరేకంగా జరిగి తన సంసార జీవితం రిస్కులో పడుతుందేమోననే భయం ఆమెను వెంటాడుతోంది. అయినా తప్పదు. అందుకే గుండె దిటవు చేసుకుంది. ఆమె మదిలో ఈ రకమైన భావాలకి కారణమైన గతం ఆమె కళ్ళముందు మెదిలింది.

★ ★ ★

పదిరోజుల క్రితం జరిగిందా సంఘటన. ఆ రోజు ఉదయం ఆమె కళ్ళబడిందా దృశ్యం. మొదట నమ్మలేదు. తాను పొరబాటు పడ్డానేమోననిపించి

ఊరుకుంది అరుణ. కానీ మరి కాస్సేపటి తర్వాత ఏదో పనుండి అటువైపు వచ్చిన ఆమె కళ్ళకి మళ్లీ అదే దృశ్యం కనబడింది. పరిశీలనగా చూసింది. ఎందుకైనా మంచిదని అప్పటికీ అనుమానించలేదు. ఎందుకంటే పొరబాట్ను అపార్థం చేసుకుంటే అది పొరబాటని తెలిసాక పశ్చాత్తాప పడవలసి వస్తుంది. అందుకే ఏ విషయాన్ని ఆధారం లేకుండా నమ్మదామె.

కానీ ఇక్కడ జరుగుతున్నది అనుమానానికి తావు లేని విషయం. అదేమిటంటే, తనెంతో ఆప్యాయంగా చూసుకునే భర్త, పక్క పోర్షన్‌లో వున్న నీలిమతో సంజ్ఞల ద్వారా, కళ్ళ ద్వారా ప్రేమకలాపాలు సాగిస్తున్నాడు. అనుమానం లేదు. వారిద్దరూ పక్కదారిన పయనిస్తున్నారు అని నిశ్చయానికొచ్చింది అరుణ వారిద్దరి ప్రవర్తనని చాటుగా కనిపెట్టిన తర్వాత.

ఈమధ్య కొద్దిరోజుల్నుంచి భర్త లేవగానే పేపర్ పట్టుకుని డాబా మీదకెందుకెళిపోతున్నాడో ఇప్పుడర్థమైంది. ఎందుకంటే అక్కడ్నుంచి పక్క పోర్షన్ క్లియర్‌గా కనబడుతుంది. వాళ్ళ పనికి ఏ ఆటంకం కలగదు. అసలు వాళ్ళిద్దరూ కలిసి ఒకే స్కూటర్ మీద అప్పుడప్పుడు ఆఫీసుకెళ్ళడమో, రావడమో చేసినా అనుమానించలేదు. ఎందుకంటే ఒకే ఆఫీసు వాళ్ళు, పక్క పక్క పోర్షన్ల వాళ్ళూ కాబట్టి ఆమాత్రం చనువుంటుందిలే అని. అదీకాక 'నీలిమ, భర్త లేని స్త్రీ' అనే సానుభూతి కూడా వుంది అరుణకి. అటువంటి సమయంలో జరిగిందిది.

శరత్‌తో అరుణకి ఆరు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. పెద్దలు కుదిర్చిందే అయినా అన్యోన్యంగా వుందా దాంపత్యం. డిగ్రీ చదివిన అరుణకి అనుకూలవంతుడే శరత్. ప్రభుత్వోద్యోగం, అందగాడు, వ్యసనాల్లేవు. భార్యంటే ప్రేమ ఇలా అన్నీ ప్లస్ పాయింట్లే. అరుణ కూడా శరత్‌కి అనుకూలమయిన ఇల్లాలే.

చదువుతోబాటు సంస్కారం మూర్తీభవించిన అరుణ ఏనాడూ భర్తకి వ్యతిరేకంగా ప్రవర్తించలేదు. శరత్‌వల్ల చిన్న చిన్న పొరబాట్లు జరిగినా ఏమీ అనేది కాదు. దానికి కారణాలు ఆమె నెమ్మదితనం ఒకటైతే, మగాడి స్వభావం చక్కగా తెలిసినామె కావడం మరో కారణం. ఆడది ప్రేమగా లాలిస్తే ఎంతటి మగాడ్నైనా అడ్డదారిలోంచి తప్పించి మంచిదారిలోకి మరల్చవచ్చునే సిద్ధాంతాన్ని నమ్మిన వ్యక్తి ఆమె.

అయితే ఆడది దేన్నయినా సహిస్తుంది కాని, తన భర్త ఇంకొక ఆడదాని వైపు చూసినా సహించదు. అలాటిది ఆమె భర్త మరో ఆడదానిమీద మోజుపడుతూండడం, దానికి అవతలి వ్యక్తి కూడా అంగీకారం తెలిపే స్థాయికి రావడం చూసిన అరుణ ఆలోచనల్లో పడింది.

ఇటువంటి సమయాల్లో దంపతుల మధ్య యుద్ధం మొదలై తారాస్థాయికి చేరుకుని, ఆ పాయింట్‌కి మరికొన్ని పాయింట్లు కలిసి జీవితాంతం జగడానికి కారణమౌతుంది. కానీ సహజంగా ముందుచూపు కల్గిన అరుణ ఈ విషయంలో తొందరపడదలచుకోలేదు. అలాగని నిర్లిప్తంగా ఊరుకోకుండా ఏ వివాదానికీ తావులేకుండా ఈ సమస్యని పరిష్కరించుకోవాలి. వారి ప్రణయ వాహినికి అడ్డు కట్ట వేయాలి. ఇది సున్నితమైన విషయం. ఏమాత్రం తొందరపడినా బెడిసికొట్టే ప్రమాదముంది.

ఎందుకంటే బిగిస్తున్నకొలదీ పట్టుదల కోసం మరింత తొందరగా జారిపోయే స్వభావం మగాడిది. అందుకే ఈ విషయంలో తొందరపడకుండా సమస్యను పరిష్కరించుకోవాలని ఒక నిశ్చయానికొచ్చింది.

అసలు వారి విషయం ఆమెకు తెలిసినట్లు కూడా వారు గుర్తించకుండా ప్రవర్తించాలి. లేకపోతే విషయం ఎలాగూ తెలిసిపోయింది కదాని బహిరంగంగా ప్రవర్తిస్తారు. వారికా అవకాశం ఇవ్వకూడదు. ఆ వైపునుంచి ఆమె ఆలోచనలు ఒక రూపాన్ని సంతరించుకున్నాయి.

★ ★ ★

ట్రైన్ దిగి ఆటోలో కూర్చుందే కాని అరుణ మనసు మనసులో లేదు. భర్త, నీలిమల విషయంలో తను అనవసరంగా రిస్క్ తీసుకున్నానేమోనని ఈ వూరి నుంచి బయలుదేరిన దగ్గర్నుంచి బాధపడుతూనే వుంది. కానీ ఇప్పుడనిపిస్తోంది. దొంగకి తాళం చెవి ఇచ్చినట్టు అలా చేయడం వల్ల వారికెంత వెసులుబాటో, చేజేతులారా తన భర్తని ఆ నీలిమకి తనే అప్పగించినట్లైందేమో! అని బాధపడుతోంది.

ఆటో ఇంటి దగ్గరాగడంతో గబగబ ఇంట్లోకి నడిచింది. అన్నదానికన్నా ఒకరోజు ముందు రావడంతో చూడరాని దృశ్యం చూడవలసి వస్తుందేమోనని ఆమె గుండె అదురుతోంది. కావాలనే ఒక రోజు ముందు వచ్చినామె భర్తని, నీలిమని ఏ స్థితిలో చూడవలసి వస్తుందో తన లెక్క తప్పలేదు కదా!

ఇంట్లోకెళ్ళేసరికి ఈజీఛైర్‌లో కూర్చుని వారపత్రిక చదువుకుంటున్న శరత్‌ని చూసి ఆమె మనసు కుదుటపడింది.

ఆమెను చూస్తూనే శరత్ ''వచ్చేసావా? అమ్మయ్య! ఒంటరితనం భరించలేక నానా అవస్థ పడ్డాననుకో'' అన్నాడు ఆమెను చుట్టేస్తూ.

ఆ మాటకు జవాబు చెప్పకుండా భర్త గమనించకుండా ఇల్లంతా ఒక్కసారి కలియజూసింది. అవేవీ గమనించని శరత్ మాత్రం ఆనందంగా మాట్లాడేస్తున్నాడు.

ఆమె మనసు ఇంకా ఒక నమ్మకానికి రాలేదు. అందుకే అడిగింది భర్తని.

''ఒంటరితనం ఎందుకు? నీలిమగారు రాలేదా?'' అంది. ఆమె ప్రశ్నకి ఎలాంటి జవాబు వస్తుందోనని ఆతృతతో భర్త ముఖంలోకి చూస్తోంది.

''నీలిమగారా? ఆవిడెక్కడున్నారు. నాలుగు రోజుల క్రిందటే ఖాళీ చేసి వెళ్ళిపోయారు'' అన్న భర్త మాటకి మనసులో సంతోషించింది. కానీ పైకి మాత్రం..

''అదేంటి అంత సడన్‌గా ఎందుకు ఖాళీ చేసేసారు?'' అడిగింది.

ఆ మాటకి శరత్ మౌనం వహించాడు. అతడి మనసులో నీలిమ అన్న మాటలే ప్రతిధ్వనిస్తున్నాయి ''నేను ఇప్పటికే తప్పు చేసాను. మీ అనురాగ దాంపత్యానికి అడ్డు తగిలి అమాయకురాలైన మీ భార్యకి ద్రోహం చేసాను. మీ భార్య సహృదయురాలు కాబట్టి మన చనువుని తప్పుపట్టలేదు. పైగా నామీద ఎంతో నమ్మకం వుంచి మిమ్మల్ని నాకప్పగించింది. ఆ నమ్మకాన్ని వమ్ము చేస్తే నాకన్నా నీచురాలు మరొకతె వుండదీ లోకంలో. ఏ జన్మలో ఏ పాపం చేసానో ఈ వైధవ్యాన్ననుభవిస్తున్నాను. క్షణిక సుఖం కోసం మళ్ళీ ఆ తప్పుచేసి మరోజన్మలో కూడా ఈ శిక్షననుభవించలేను. మీ ఇంటి దగ్గర్లోనే వుంటే మళ్ళీ నా మనసు చలించవచ్చు. అందుకే దూరంగా వెళ్ళిపోతున్నాను'' అన్న నీలిమ మాటలు గుర్తొచ్చినా వాటిని బయటకు చెప్పలేక...

''ఏమో! నాకేం తెలుసు?'' అని మాత్రం అనగలిగాడు.

ఆ మాటన్నప్పుడు భర్త ముఖంలో కలిగిన భావాలు చదివిన అరుణ మదిలోనే ఆనందించింది.

